నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 7 జనవరి 2025 | KHAMMAM

నేలకొండపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న మండల నాయకులు

ఇల్లెందు రూరల్ : బైక్ మీద ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

మణుగూరు టౌన్ : ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు


తల్లాడలో రైతులు, పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిటౌన్ : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కర్షకుల కన్నెర్ర

- 'రైతుభరోసా' కోతలపై భగ్గుమన్న అన్నదాతలు
- కేటీఆర్ పిలుపు మేరకు ఎక్కడికక్కడ ఆందోళనలు
- అధికారులకు వినతులు.. వినూత్న రీతిలో నిరసనలు
- రైతులకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నినాదాలు
- పలువురు పార్టీ నేతలను అరెస్టు చేసిన పోలీసులు
- లక్ష్మీదేవిపల్లిలో దున్నపోతుకు వినతి ఇచ్చి నిరసన

ఖమ్మం, జనవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ సర్కారుపై కర్షకులు కన్నెర్రజేశారు. రైతుభరోసా కోతలపై భగ్గుమన్నారు. రైతుభరోసా పేరిట అన్నదాతలకు పంటల పెట్టుబడి సాయాన్ని రూ.15 వేలు ఇస్తామంటూ నమ్మబలికి ఓట్లు కొల్లగొట్టిన కాంగ్రెస్ పెద్దలు.. ఇప్పుడు ఆ సాయాన్ని రూ.12 వేలు మాత్రమే ఇస్తామంటూ మాటతప్పడంపై రైతులు ఆగ్రహంతో రగిలిపోయారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు అన్నదాతలతో కలిసి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కదం తొక్కారు. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా సోమవారం ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నాలకు దిగారు. రహదారులపై రాస్తారోకోలు చేశారు.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ప్రకటించిన మాదిరిగా రైతుభరోసాను అందజేయాల్సిందేనని అన్నదాతలు డిమాండ్ చేశారు. తమకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ముక్తకంఠంతో నినదించారు. మాయమాటలు చెప్పి రైతులతో ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నాయకులు మాట నిలుపుకోకపోతే గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగా ఎలాంటి ఆంక్షలు, షరతులు లేకుండా పంటల పెట్టుబడి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వేంసూరు : నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎక్కడికక్కడ నిరసనలు..

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఉదయం 10 గంటల నుంచి మొదలుకొని మధ్యాహ్నం 2 గంటల వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం ఆయా మండలాల్లో రెవెన్యూ అధికారులకు రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ నేతలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తల్లాడలో జరిగిన నిరసనలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యానికి ప్రకటించిన బోనస్‌ను అన్ని రకాల పంటల రైతులకూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి భారీ ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. కల్లూరులో మాజీ ఎంపీపీ బీరెల్లి రఘు, మాజీ జడ్పీటీసీ కట్టా బాబు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. బోనకల్లులో రైతులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అశ్వారావుపేటలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇల్లెందు రూరల్ మండలంలో బీఆర్ఎస్ నాయకులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆంక్షలు లేకుండా రైతుభరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. టేకులపల్లిలోనూ బీఆర్ఎస్ నేతలు బొమ్మెర వరప్రసాద్, లక్కినేని సురేందర్‌రావు రైతులతో నిరసనకు దిగారు. వేంసూరులో మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేపట్టారు. దుమ్ముగూడెంలో బీఆర్ఎస్ నాయకులు కణితి రాముడు, ఎండీ జానీపాషా, రైతులు; పెనుబల్లిలో పార్టీ నేతలు కనగాల వెంకట్రావ్, భూక్యా ప్రసాద్, మాజీ ఎంపీపీ లక్కినేని అలేఖ్య, రైతులు కలిసి ధర్నా చేశారు. మధిరలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. సత్తుపల్లిలో జరిగిన నిరసన కార్యక్రమానికి సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపుడి మహేశ్ హాజరయ్యారు. ఇల్లెందు పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు భారీ ర్యాలీ చేపట్టారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మణుగూరులోనూ బీఆర్ఎస్ నాయకులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ముదిగొండలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నేలకొండపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య ఆధ్వర్యంలో, భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో పార్టీ మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. లక్ష్మీదేవిపల్లిలో దున్నపోతుకు వినతిపత్రం అందజేసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు.

అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలి

గ్రీవెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఖమ్మం కలెక్టర్

మామిళ్లగూడెం, జనవరి 6 : ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలను త్వరగా పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తల్లాడ మండలం కలకొడిమ గ్రామానికి చెందిన ఆదూరి శిరీష తాను ఎస్సీ కుటుంబానికి చెందిన మహిళను అని, గతంలో ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇల్లు కొరకు దరఖాస్తు చేసుకున్నానని, ప్రస్తుత సర్వేలో తన పేరు రాలేదని, తనకు ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకుంది. దీనిపై ఈఈ హౌసింగ్ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టండి

గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ విద్యాచందన

విజ్ఞప్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

కొత్తగూడెం టౌన్, జనవరి 6 : తమ తమ సమస్యలపై బాధితులు సమర్పించే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ విద్యాచందన సంబంధిత అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిపాలనాధికారి రమాదేవి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్

గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఏపీవో

భద్రాచలం, జనవరి 6 : అర్హులైన ప్రతీ గిరిజనుడికి ఐటీడీఏ ద్వారా సంక్షేమ పథకాలు అందించడానికి ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఏపీవో డేవిడ్‌రాజు అన్నారు. భద్రాచలం ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి ఏపీవో వినతులు స్వీకరించారు. తన పరిధిలోని వాటిని పరిష్కరించి, మిగిలిన వాటిని ఆయా శాఖల అధికారులకు పరిష్కారం కోసం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైకార్ ద్వారా సబ్సిడీ రుణాలు, పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాల రుణాలు, పట్టా భూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థిక సాయం తదితర సమస్యలపై వినతులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించి.. అర్హులందరికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, ఏవో సున్నం రాంబాబు, ఎఫ్‌డీసీ ఉదయ్‌కుమార్, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, ఏపీవో పవర్ ఏఈ మునీర్‌పాషా, డీటీఆర్ఓఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమ్మెకు సంఘాల మద్దతు

ఇల్లెందు, దమ్మపేటలో నాల్గవ రోజుకు చేరిన హమాలీల సమ్మె

ఇల్లెందు, జనవరి 6 : పెంచిన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జీసీసీ హమాలీలు చేపట్టిన సమ్మెకు పలు సంఘాలు మద్దతు పలుకుతున్నాయి. ఇల్లెందులో జీసీసీ గిడ్డంగి-1 ఎదుట హమాలీలు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి నాల్గవ రోజుకు చేరింది. సమ్మెకు ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు కొక్కు సారంగపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ రసుద్దీన్, జిల్లా అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. సివిల్ సప్లై, జీసీసీలో పనిచేసే హమాలీ కార్మికులకు పెరిగిన వేతనాలను ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం పెరిగిన వేతనాలను వెంటనే చెల్లించాలని, లేదంటే ఐక్యంగా సమ్మెను ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సింగారపు శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు. హమాలీల సమ్మెకు తమ మద్దతు కూడా తెలుపుతున్నట్లు ఏఐటీయుసీ డివిజన్ కార్యదర్శి ఎండి.నజీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిన హమాలీలు

దమ్మపేట, జనవరి 6 : జీసీసీ హమాలీ కార్మికులు నాల్గవ రోజు సమ్మెలో భాగంగా మేస్త్రీ భోగి సత్యం ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని కలెక్టరేట్ ముట్టడికి సోమవారం తరలి వెళ్లారు. కలెక్టరేట్ వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు ప్రసాద్, వెంకట్, నరసయ్య, సత్యనారాయణరాజు, మణికంఠ, కోట సుబ్బారావు, పోలయ్య, కొండా రాజు, కందుకూరి వీర్రాజు, పాలడుగు రామారావు, కామినేని రమేశ్, చెన్నారావు, రొయ్యల ప్రసాద్, వెంకటయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో హమాలీలకు మద్దతు తెలుపుతున్న సారంగపాణి, నాయకులు

భద్రాద్రి కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరిన జీసీసీ హమాలీలు

పారదర్శకంగా ఓటరు జాబితా

- జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు బాలమాయాదేవి
- మూడు జిల్లాల ఓటరు జాబితా సవరణ-2025పై సమీక్ష

గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఏపీవో

మామిళ్లగూడెం, జనవరి 6 : ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలని జిల్లా ఓటరు జాబితా సవరణ-2025 పరిశీలకులు బాలమాయాదేవి అన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో ఓటరు జాబితా-2025పై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ముందుగా ఖమ్మం జిల్లా ఓటరు జాబితాపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాను విజయవంతంగా ప్రచురించినందుకు అధికారులను ఆమె అభినందించారు. ఓటరు జాబితాకు సంబంధించిన వివరాలను పార్టీల ప్రతినిధులకు సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీలను అందించాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 98.15 శాతం ఓటరు కార్డుల పంపిణీ పూర్తి చేసి.. కొత్త ఓటర్ల కార్డులు ముద్రణకు పంపించామన్నారు. జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 12,30,572 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వారిలో స్త్రీ, పురుషుల నిష్పత్తి 1,076గా ఉందని తెలిపారు. జిల్లాలో మొత్తం 8,582 కొత్త ఓటర్లను జాబితాలో నమోదు చేశామన్నారు. అలాగే చనిపోయిన 1,641 మంది, ఇతర ప్రాంతాలకు వెళ్లిన 3,472 మంది, రిపీటెడ్‌గా ఉన్న 127 పేర్లను తొలగించామన్నారు. జిల్లాలో మొత్తం 27,225 దివ్యాంగ ఓటర్లు ఉన్నారని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన 21,549 దరఖాస్తులలో ఇప్పటివరకు 18,411 దరఖాస్తులను ఆమోదించామని, మరో 3,112 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించామని తెలిపారు. అనంతరం మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించిన ఓటర్ల జాబితా సవరణపై సమీక్షించారు. సమావేశంలో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, మూడు జిల్లాల ఈఆర్వోలు, ఏఆర్వోలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

రేగా కాంతారావు

మణుగూరు టౌన్, జనవరి 6 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటినుంచే బీఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున నియోజకవర్గ ఇన్‌చార్జిలు అన్ని గ్రామా ల్లో సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి అభ్యర్థుల ఎంపికపై ఒక అవగాహనకు రావాలని సూచించారు. అన్ని కమిటీలను పండుగలోపు సమావేశపర్చాలని, ఆ తర్వాత జిల్లా సమావేశం ఏర్పాటు చేసుకుందామని పేర్కొన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆరు గ్యారెంటీల అమలు కోసం ఉద్యమం

జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల

పొద్దుటూరులో స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నాహక సమావేశం

మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిర (చింతకాని), జనవరి 6 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారెంటీల అమలు కోసం ఉద్యమాలు చేయాలని జడ్పీ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. చింతకాని మండలం పొద్దుటూరు గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహాక సమావేశం మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఆరు గ్యారెంటీలపై అతీగతీ లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, దళితబంధు, రైతుబీమా, రుణమాఫీ, కేసీఆర్ కిట్టు, కల్యాణలక్ష్మి వంటి అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని మండిపడ్డారు. ఇలాంటి దుర్మార్గమైన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, మండల నాయకులు వంకాయలపాటి లచ్చయ్య, మంకెన రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ గురజాల హన్మంతరావు, వేముల నర్సయ్య, ఆళ్ల పాకాలరావు, చాట్ల సురేశ్, సామినేని అప్పారావు, నన్నక కోటయ్య, మైనార్టీ నాయకుడు జావిద్ తదితరులు పాల్గొన్నారు.

'ముక్కోటి' పనుల్లో వేగం పెంచండి

ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సమీక్ష

ముక్కోటి ఏర్పాట్ల పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం, జనవరి 6 : ముక్కోటి ఏకాదశి ఏర్పాట్ల పనుల్లో వేగం పెంచాలని, మంగళవారం నాటికి పనులన్నీ పూర్తి కావాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. తొలుత భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్.. ముక్కోటి పనులు ఎంతవరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో భద్రాద్రికి తరలివచ్చే అవకాశం ఉండడంతో పనుల్లో అలసత్వం వద్దని, తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఆలయ పరిసరాలు, పట్టణంలో స్వచ్ఛత పాటించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఈ నెల 9, 10 తేదీల్లో పట్టణంలోని మాంసం, మద్యం దుకాణాలు పూర్తిగా బంద్ చేయించాలని ఎక్సైజ్, పోలీసు శాఖలను ఆదేశించారు. ముక్కోటి సందర్భంగా రామాలయానికి వచ్చే భక్తులతోపాటు గోదావరి, కరకట్ట ప్రాంతాల్లో ఈ ఏడాది గిరిజన సాంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పే విధంగా రివర్ ఫెస్టివల్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గిరిజనుల వంటకాలు, కళాఖండాలు, ఔషధ గుణాలు కలిగిన ఆహార పదార్థాల అమ్మకాల కోసం స్టాళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుడిసెల్లో పర్యాటకులు బస చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం ఎస్పీ రోహిత్‌రాజు, డీఆర్‌డీవో విద్యాచందన, ఆలయ ఈవో రమాదేవి, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్‌లతో కలిసి ఆలయ పరిసరాలు, గోదావరి వద్ద ముక్కోటి ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ వెంకటేశ్వర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.